మృతుడి కుటుంబానికి వంటేరు పరామర్శ

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 27 : కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామానికి చెందిన గట్టు కిషన్ ప్రమాదవశాత్తు పాముకాటుతో మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్ చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంపిటీసీల పోరం మాజీ అధ్యక్షుడు దేవీ రవీందర్, ఈగ స్వామి పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

హుస్నాబాద్, అక్టోబర్ 27: హుస్నాబాద్ పట్టణంతో పాటు డివిజన్‌లోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న పటాకుల దుకాణాల నిర్వాహకులు భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని ఏసీపీ సతీశ్ వాసాల అన్నారు. ఆదివారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ పటాకుల దుకాణాల నిర్వహణకు తప్పకుండా అనుమతులు తీసుకోవాలని, నిబంధనలను విధిగా పాటించాలని చెప్పారు. పోలీసు, మున్సిపల్, అగ్నిమాపక శాఖలు కేటాయించిన స్థలంలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాల సమీపంలోనే ఇసుక, నీరు, ఫైర్‌ఇంజన్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దుకాణాలను జనావాసాల మధ్య ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రతి దుకాణాదారుడు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

గజ్వేల్, అక్టోబర్ 27: మహిళలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలను ఎదురించడానికి ఏకంకావాలని జాతీయ మహిళా సమైఖ్య సంఘం జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ అన్నారు. ఆదివారం ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహాడ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతనం పల్లెపహాడ్ నూతన గ్రామ మహిళా సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శివలింగు లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా గూడురి యాదవ్వ, సహాయ కార్యదర్శిగా మాడుగూరి లావణ్యతో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజిరెడ్డి

చేర్యాల, అక్టోబర్ 27 : మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన టీ పీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డిని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆదివారం మొగుళ్లకు నియామక పత్రాన్ని హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.హైదరాబాద్ జలమండలి, కాన్గార్ యూనియన్ అధ్యక్షుడిగా రాజిరెడ్డి కొనసాగుతున్నారు.ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిన సంజీవరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజు

గజ్వేల్, అక్టోబర్ 27: తెలంగాణ రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక వద్ద ఉన్న కార్యాలయంలో జరిగాయి. గజ్వేల్ పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది టి.రాజును రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40ఏండ్లుగా ఉమ్మడి ఏపీ అర్చరీ సంఘానికి అందించిన సేవలను గుర్తించి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే గజ్వేల్ పట్టణంలో అర్చరీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు.

సంయుక్త కార్యదర్శిగా శివకుమార్

గజ్వేల్, అక్టోబర్ 27: రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల్లో సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న శివకుమార్‌ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎన్సీ. సంతోష్‌గుప్తా మాట్లాడుతూ రాష్ట్ర అసోసియేషన్‌లో జిల్లాకు అవకాశం రావడం గర్వకారణమన్నారు. కబడ్డీ క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించేలా సాధన అవసరమని, అందుకు గ్రామీణ ప్రాంత క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించాలన్నారు.

అపూర్వ సమ్మేళనం

గజ్వేల్, అక్టోబర్ 27: గజ్వేల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983-84 టెన్త్ చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయం సమ్మేళనం నిర్వహించుకొన్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చదువుకున్న పాఠశాల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగేశ్వర్ రావు, పూర్వ విద్యార్థులు ఉమాదేవి, నేతి శ్రీనివాస్, అంబదాస్, తోట భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

కొమురవెల్లి, అక్టోబర్ 27 : కొమురవెల్లి మండలం ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-2002లో టెన్త్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 22 ఏండ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, నాగభుషణం, శ్రీరాములు, నర్సింహులు, ఆనంద్, నారాయణరెడ్డి, జనార్దన్ రెడ్డి, పూర్వ విద్యార్థులు నాగమల్ల సత్యనారాయణ సంపత్‌రెడ్డి, జిల్లా వెంకట్‌నారాయణ, అశోక్, ప్రవీణ్, కవిత, సంతోషి, మంజుల, రేఖ, స్వాతి పాల్గొన్నారు.

కోహెడలో

కోహెడ, అక్టోబర్ 27: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-96లో టెన్త్ చదివిన 80 మంది పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకొన్నారు. ఒకరినొకరు పలకరించుకుని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్య నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



గజ్వేల్: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొమురవెల్లి: ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొమురవెల్లి 'మల్లన్న' క్షేత్రంలో భక్తుల రద్దీ

మల్లన్న ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ,చిత్రంలో రుద్రాక్షమాల అలంకరణలో మల్లికార్జున స్వామి

చేర్యాల, అక్టోబర్ 27 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో రద్దీ నెలకొన్నది. మల్లన్న స్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవక్షేత్రం పులకరించింది.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.కొమురవెల్లి క్షేత్రానికి 10వేల మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగరేగుచెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు.మరికొందరు రాతిగీరల వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. మల్లన్న ఆలయ అధికారులు,ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గ పూజారులు తదితరులు భక్తులకు సేవలు అందించారు.

బీఆర్ఎస్ మహిళా కార్యదర్శి మృతి

మహిళా కార్యదర్శి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ పట్టణ మహిళా కార్యదర్శి బుడిగే విజయ ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయ మృతి చెందడంతో బీఆర్ఎస్ నాయకులు ఆమె భౌతిక కాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్‌టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్ గౌడ్, సీనియర్ నాయకుడు ముస్త్యాల బాల్ నర్సయ్య, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, టౌన్ కార్యదర్శి బూరగోని తిరుపతిగౌడ్, మాజీ సర్పంచ్ ముస్త్యాల అరుణ, మాజీ ఉప సర్పంచ్ మంచాల కొండయ్య, నాయకులు బుట్టి ఆగమల్లు, ఎర్రోళ్ల రామచంద్రం, కూరపాటి మధు, భూమిగారి రాజేందర్,పచ్చిమడ్ల మహేందర్, బుడిగే శ్రీను, పచ్చిమడ్ల బాచి పాల్గొన్నారు.

పాతకక్షల నేపథ్యంలో ఇద్దరిపై రాడ్లతో దాడి

- ఒకరి పరిస్థితి విషమం, మరొకరికి తీవ్రగాయాలు
- ఎనిమిది మంది అరెస్టు.. కేసు నమోదు

బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న చేర్యాల సీఐ శ్రీను

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్27: పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని ఇద్దరిపై కొంతమంది రాడ్లు, కర్రలతో దాడి చేశారు. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మద్దూరులో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన చిలుక సతీశ్, చిలుక లచ్చయ్య కుటుంబాల మధ్య ఇటీవల గొడవ జరిగింది. శనివారం రాత్రి తొమ్మిది గంటలకు చిలుక సతీశ్ తన స్నేహితుడైన దామెర విజయ్‌ను బైక్‌పై ఎక్కించుకొని గ్రామంలోని బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్తుండగా పాతకక్షలను దృష్టిలో పెట్టుకున్న చిలుక లచ్చయ్య, చిలుక రాజు, చిలుక రాంబాబు, చిలుక పరశురాములు, చిలుకబాబు, చిలుక మురళి, చిలుక ప్రేమ్‌కుమార్, చిలుక మురళి గ్రామంలోని చర్చి సమీపంలో సతీశ్ బైక్‌ను అడ్డగించి తమ వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్లు, కర్రలతో సతీశ్, విజయ్‌ను విచక్షణారహితంగా కొట్టగా గాయపడ్డారు. దీంతో వారిని కుటుంబసభ్యులు చేర్యాల సర్కారు దవాఖానకు తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు సిద్దిపేటకు తరలించారు. సతీశ్‌ను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. సతీశ్ ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సతీశ్ తండ్రి చిలుక దశరథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో ముందస్తు చర్యల్లో భాగంగా హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీను, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, చేర్యాల ఎస్సై నీరేశ్, కొమురవెల్లి ఎస్సై రాజు, అక్కన్నపేట ఎస్సై విజయ్‌భాస్కర్, స్పెషల్ పార్టీ పోలీసులు ఆదివారం గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు.

వ్యర్థాలు తిని ఆవు మృతి

ములుగు, అక్టోబర్ 27 : పరిశ్రమ నుంచి వెలువడిన వ్యర్థాలను తిని ఓ ఆవు మృతిచెందిన ఘటన ములుగు మండలంలోని కొక్కొండలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సత్తయ్య ఆవు మేత కోసం వెళ్లి గ్రామంలోని ఓ పరిశ్రమ నుంచి వెలువడిన వ్యర్థాలను తిని మృతిచెందినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశార. ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకొని విషవాయువులు, వ్యర్థాలను విడుదల చేస్తున్న కంపెనీలను సీజ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. పోసుమార్టం నిర్వహించి పరీక్షల నిమిత్తం ఆవు అవయవాలను సంగారెడ్డికి తరలించినట్లు మండల పశువైద్యాధికారి పల్లవి తెలిపారు.

శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేత

మాట్లాడుతున్న అభిరామ్ డెంటల్ దవాఖాన డాక్టర్ దేవులపల్లి శ్రీదేవి

సిద్దిపేట కమాన్, అక్టోబర్ 27 : ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న వారందరూ ఆర్థికంగా ఎదగాలని.. ఇతరులకు సహాయం అందించేలా రాణించాలని అభిరామ్ డెంటల్ దవాఖాన డాక్టర్ దేవులపల్లి శ్రీదేవి సూచించారు. 45 రోజులపాటు టైలరింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్‌లో శిక్షణ తీసుకున్న 30 మంది విద్యార్థులకు ఆదివారం సిద్దిపేటలో అసోసియేషన్ అధ్యక్షురాలు స్వరూపారాణితో కలిసి ఆమె సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ వారు శిక్షణతో పాటు యోగా, ధ్యానం నేర్పిస్తున్నట్లు తెలిపారు. మరో బ్యాచ్ 3-11-2024 నుంచి ప్రారంభమవుతుందని, ఆసక్తిగల వారు సెల్: 9491995033, 9885 885262 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ నగేశ్, జయ, సుగుణ, సుమలత, అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు గొంతు విప్పాలి

ప్రొపెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేస్తున్న సంఘాల ప్రతినిధులు

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 27 : ప్రొఫెసర్ సాయిబాబా ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకువెళ్లి ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు మేధావులు,ప్రజాస్వామిక వాదులు ,రచయితలు గొంతు విప్పాలని ప్రజాసంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సామాజిక ఉద్యమ నేత, ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ జరిగింది.ఈ సందర్భంగా వివిధ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ..ఆదివాసీల హక్కుల కోసం సాయిబాబా జీవితాంతం పోరాటం చేశారన్నారు. దేశ సంపద కార్పొరేట్ శక్తులకు కాకుండా పేదలకు దక్కాలని ఆయన తపన పడ్డాడన్నారు. ఉద్యమాల అణిచివేతకు వ్యతిరేకంగా పోరాటం చేశారని గుర్తుచేశారు. నిర్ధోషిగా బయటకి వచ్చిన సాయిబాబా తీవ్రమైన లనారోగ్యంతో మృతి వాత పడ్డాడన్నారు. పేద ల పక్షాన నిలబడి పోరాడిన అమరుడు ప్రొఫెసర్ సాయిబాబా ఆశయ సాధనకు నేటి యువతరం ముందుకు రావాలని వక్తలు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు భూపతి,సత్తయ్య, నారాయణ, మల్లారెడ్డి,రంగాచారి, సాయిబాబా కుతురు మంజీరా, రాజనర్సింహా, పవన్, చంద్రమౌళి,అభినవ్, శంకర్, శ్రీహరి, రాజిరెడ్డి,సంతోష్,శ్రీకాంత్,బాలయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

అనుభవాలతో ఫలితాలు సాధించాలి

మాట్లాడుతున్న మెడక్ ఎంపీ రఘునందన్‌రావు,చిత్రంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 27: అనుభవాలు విజయాలను సమీక్షించుకుంటూ చక్కటి ఫలితాలు సాధించాలని మెడక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన అనంతరం అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తూ జాతి వికాసంలో శిశుమందిర్ తనదైన ముద్ర వేసుకుంటున్నదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, నిర్వాహకులు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు, డాక్టర్ పద్మజ్యోతి, సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ మీలా శ్రీధర్, దొంతి రమేశ్, కౌన్సిలర్ రహీం, నాయకుడు జశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్27: రైతులు పండించిన ధాన్యానికి కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారుల నుంచి రైతులను కాపాడి మద్దతు ధర అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు.కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ సర్పంచ్‌లు బండి చంద్రయ్య, సందిటి లక్ష్మి, ముక్క కనకయ్య, సీసీ మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోల సాయిలు, నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ముస్త్యాల మనోహర్, సిరిమల్ల భాస్కర్, జెల్ల శ్రీనివాస్, గద్దల మహేందర్, కోరండ్ల వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల్లో సీపీఎం కీలకం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు

గజ్వేల్, అక్టోబర్ 27: ప్రజా ఉద్యమాల్లో సీపీఎం కీలకమైనదని, అన్ని వర్గాలకు అండగా నిలబడి పోరాటాలు చేసిందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్కా రాములు అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సీపీఎం మూడో మహాసభలను డిసెంబర్ 1,2 తేదీల్లో గజ్వేల్ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా రైతాంగ సమస్యలపై పోరాటం చేయడంలో ముందున్నామన్నారు. దేశంలో జరిగిన రైతాంగ పోరాటంలో సీపీఎం వెన్నుదన్నుగా నిలబడిందని, తమ పోరాట ఫలితంగా రైతు వ్యతిరేక చట్టాలను కేంద్రం వెనక్కి తీసుకుందన్నారు. జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్‌గా చుక్కా రాములును నియమించారు. సీపీఎం నాయకులు ఎల్లయ్య, గోపాల స్వామి, శశిధర్‌భాస్కర్, సత్తిరెడ్డి, శారద, రవి, యాదగిరి, శిరీష, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, స్వామి, వెంకటాచారి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, అక్టోబర్ 27: మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి శేఖర్‌బాబు సోదరుడు నరేశ్ బాబు ఇటీవల మృతిచెందాడు. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను రాష్ట్ర సాంస్కృతిక సారథి మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

వైద్యశిబిరానికి స్పందన

ఉచితంగా మందులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, వైద్యులు

అక్కన్నపేట, అక్టోబర్ 27: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కరీంనగర్‌కు చెందిన ఎంఎన్ఆర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ మౌనికరెడ్డి, డాక్టర్ సతీశ్‌రెడ్డి గ్రామస్తులకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి, తమ దవాఖానకు రావాలని సూచించారు. అంతకుముందు ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు రాంగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామంచ మహేందరెడ్డి వైద్యబృందంతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలందిస్తున్న దవాఖాన యాజమాన్యం, వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అభిలాష్‌రెడ్డి, హరికృష్ణ, నాయకులు జనగామ వేణుగోపాల్‌రావు, చెరుకు సంపత్, తిరుపతి, కనుకయ్య పాల్గొన్నారు.

లిఖితకు అభినందనల వెల్లువ

మెడికల్‌లో సీటు సాధించిన విద్యార్థిని లిఖితను అభినందిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 27: సిద్దిపేట పట్టణంలోని భరత్‌నగర్ చెందిన విద్యార్థిని లిఖిత నీట్ పరీక్ష రాసి ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడికల్ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లిఖితను ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ నాయకుడు భూంపల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వంకాయలో 'ఓం' ఆకారం

వంకాయలో ఓం ఆకారం

చేర్యాల, అక్టోబర్ 27 : పట్టణానికి చెందిన ఓ గృహిణి కూర చేసేందుకు వంకాయను కొయగా అందులో ఓం ఆకారం బయటపడింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు పుర్మ వెంకట్‌రెడ్డి సతీమణి పుర్మ కరుణ వంకాయ కర్రీ చేసేందుకు వంకాయను కొస్తున్న క్రమంలో ఓం ఆకారం కనిపించింది. దీనిని గమనించిన ఆమె భర్త వెంకట్ రెడ్డికి తెలియజేయడంతో పాటు వెంటనే దానిని ఇంట్లో ఉన్న పూజ గదిలోకి తీసుకువెళ్లి పసుపు,కుంకుమ వేసి పూజ చేసి మొక్కుకున్నారు. వంకాయలో ఓం ఆకారం రావడంతో పుర్మ దంపతులు ఒకింత సంతోషం వ్యక్తం చేశారు.

రక్తదాన శిబిరానికి స్పందన

రక్తదానం చేస్తున్న దాతలు

చేర్యాల, అక్టోబర్ 27 : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం వివేకానంద టీచర్స్ అసోసియేషన్, చేర్యాల రక్తదాన్ సేవ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వివేకానంద టీచర్స్ అసోసియేషన్ చేర్యాల గౌరవ అధ్యక్షుడు మీస వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజ సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.కార్యక్రమంలో నిర్వాహకులు బాలభాస్కర్, నితీశ్, అమరేందర్‌రెడ్డి, సిద్దా రెడ్డి, సిద్ది శ్రీనివాస్, అరవింద్, పరమేశ్వర్, నరిగె శ్రీనివాస్, రజనీకాంత్, గణేశ్, కరుణాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి అంబులెన్స్‌లు మంజూరు చేయాలి

అక్కన్నపేట: పీహెచ్‌సీ ఎదుట మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

అక్కన్నపేట, అక్టోబర్ 27: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండు అంబులెన్స్‌లు మంజూరు చేయాలని, దవాఖానను 50 పడుకలకు అప్‌గ్రేడ్ చేయాలని బీఎస్పీ నియోజకపర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మండలంలో 37 గ్రామ పంచాయతీలు, సుమారు 100 గిరిజన తండాలు ఉన్నాయన్నారు. అక్కన్నపేట, రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అంబులెన్స్ సౌకర్యాలు లేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసరంగా తీసుకువెళ్లే అంబులెన్స్ లేక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్, నియోజకవర్గ అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

మాలమహానాడు ఆవిర్భావ దినోత్సవం

చేర్యాలలో మాలమహానాడు అవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు

చేర్యాల